

వంజంగి అందాలు అదరహో

సాక్షి, పాడేరు: విశ్వవ్యాప్తి పొందిన వంజంగి హిల్స్ అందాలను తిలకించేందుకు పర్యాటకులు రోజురోజుకు పోటెత్తుతున్నారు. మంగళవారం తెల్లవారుజామునుంచి భారీగా తరలివచ్చారు. సూర్యోదయం, పొగమంచు, కొండలను తాకిన మేఘాల అందాలను తిలకించారు.

శీతాకాల సమావేశాలకు అరకు ఎంపీ మాధవి



కొయ్యూరు: శీతాకాల సమావేశాల్లో పాల్గొనేందుకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి మంగళవారం ఢిల్లీ వెళ్లారు. దీంతో ఆమె కొద్ది రోజుల పాటు స్థానికంగా అందుబాటులో ఉండరని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆమె కార్యాలయ వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

పశువ్యాధులపై అవగాహన కల్పించాలి



జేడీ వెంకటస్వామిని సత్కరిస్తున్న పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు

చింతపల్లిరూరల్: పశువులకు సోకే వ్యాధుల పట్ల గిరిజనులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి. వెంకటస్వామి సూచించారు. మంగళవారం లంబసింగిలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలకు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాల వారీగా పశువులకు సోకే వ్యాధుల నివారణకు చేపట్టిన చర్యలను తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు ముద్ద చర్మ వ్యాధికి సంబంధించి 3.8లక్షల పశువులకు వ్యాక్సిన్ చేశామని జేడీ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్‌రావు, నోడల్ అధికారి డాక్టర్ నరేష్, ఓఎస్‌డీ గంగాధర్, పశువైద్యాధికారులు దుర్గాప్రసాద్, నూకేష్, షాలిని, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు



తాజంగిలో పర్యటిస్తున్న ట్రైనీ కలెక్టర్ అసుతోష్

చింతపల్లిరూరల్: పర్యాటక ప్రాంతమైన లంబసింగిలో మంగళవారం ట్రైనీ కలెక్టర్ అసుతోష్ పర్యటించారు. ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. లంబసింగి, తాజంగి ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతాయని, ఎటువంటి దురదృష్టకర సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్



అవగాహన కలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్

అరకులోయ రూరల్: ఓటు హక్కు ప్రయోజనాలపై అవగాహన అవసరమని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ పట్టాసి చలపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



హుకుంపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కార్యకర్తలు, విద్యార్థినుల మానవహారం

హుకుంపేట: మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యలయంలో సీడీపీవో బాలచంద్రమణి దేవి అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్తలు,స్థానిక పాఠశాలల విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంతకుముందు అవగాహన ర్యాలీ నిర్వహించారు. లైంగిక దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు వేధింపులు, అత్యాచారాలు, లైంగిక వేధింపులకు గురైన సందర్భాల్లో వెంటనే 1098, 111, 100, 181 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎస్‌ఐ సతీష్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, వెలుగు ఏపీఎం చిన్నారావు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముసురుమిల్లి రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- రూ.1.5 కోట్లతో ముసురుమిల్లి ప్రాజెక్ట్ కెనాల్‌పై ఎత్తిపోతల పథకం
- ప్రతిపాదనలు పంపిన ఇరిగేషన్ అధికారులు
- కార్యరూపం దాల్చితే 300 ఎకరాలకు సాగునీరు
- గిరి రైతుల్లో ఆనందం



ఎత్తిపోతల పథకం నిర్మించనున్న ముసురుమిల్లి కెనాల్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు

రంపచోడవరం: ముసురుమిల్లి ప్రాజెక్టు కెనాల్‌పై ఎత్తిపోతల పథకం నిర్మించి గిరిజన రైతుల భూములకు సాగు నీరిచ్చేందుకు కసరత్తు ప్రారంభమైంది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దిగువన ఉన్న భూములకు సాగు నీరిచ్చేందుకు ఎత్తిపోతల పథకం నిర్మించాలని గిరిజనులు కోరారు. దశాబ్ద కాలానికిపైగా ఎత్తిపోతల పథకం నిర్మాణంపై ఎటువంటి కదలిక లేదు. తాజాగా ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ముసురుమిల్లి కెనాల్‌ను అధికారులు పరిశీలించారు. గ్రామస్తులతో కూడా మాట్లాడారు.ఇది కార్యరూపం దాలిస్తే సాగునీటి సమస్య ఎదుర్కొంటున్న గిరిజనులకు ఉపశమనం లభించనుంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ముసురుమిల్లి ప్రాజెక్టు కెనాల్‌పై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.1.5 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీని నిర్మాణం వల్ల 300 ఎకరాలకు సాగునీరు అందుతుందని అందులో పొందుపరిచారు.

వివరాలిలా..

- సీతపల్లి వాగుపై నిర్మించిన ముసురుమిల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా తామరపల్లి గ్రామం వైపు ఉన్న కెనాల్‌పై మోటార్లు అమర్చుతారు. సీతపల్లి వాగుపై పైపు లైను నిర్మించి గిరిజనుల భూములకు సాగునీరు అందిస్తారు.
- ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా రెండు పంటలకు నీరు విడుదల చేసినప్పుడు ఎత్తిపోతల పథకం ద్వారా కూడా ప్రాజెక్టు దిగువన భూములకు సాగునీరు అందుతుంది.

మరో 500 ఎకరాలకు నీరివ్వాలని వినతి

రంపచోడవరం డివిజన్‌లోని దేవీపట్నం మండలంలోని గ్రామాల్లో మరో 500 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని అక్కడ గిరిజనులు కోరుతున్నారు. ప్రతి ఏటా ముసురుమమిల్లి ప్రాజెక్టు ద్వారా 2.53 టీఎంసీలు నీటి విడుదల చేస్తున్నారు. ముసురుమల్లి ప్రాజెక్టు కెనాలపై డ్రైజర్ ద్వారా సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు జేసీ రవితేజ తెలిపారు.

ఎంతోకాలంగా ఎదురుచూపు

ముసురుమిల్లి ప్రాజెక్టు దిగువున భూములకు సాగు నీరు అందించాలని కోరుతున్నాం. ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని గిరిజనులు అడుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకం కోసం ఇరిగేషన్ అధికారులు పరిశీలన చేశారు. త్వరగా ఎత్తిపోతల పథకం నిర్మించి గిరిజనుల భూములకు సాగు నీరు అందించాలి.

–బొబ్బా శేఖర్, రైతు, ఇర్లపల్లి ఆర్అండ్ఆర్ కాలనీ

లిఫ్ట్ ఇరిగేషన్‌తో రైతులకు మేలు

ముసురుమిల్లి ప్రాజెక్టు దిగువున పొలాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు ఇస్తామన్నారు. దశాబ్ద కాలం అవుతున్నా దాని ఊసే లేదు. ఇప్పుడు ముసురుమిల్లి కెనాలపై ఎత్తిపోతల పథకం నిర్మాణం చేస్తామంటున్నారు. ఇరిగేషన్ ఇంజనీర్లు వచ్చారు. త్వరగా నిర్మాణం చేపడితే రైతులకు మేలు చేకూరుతుంది.

–బాలు రెడ్డి, రైతు ముసురుమిల్లి

విద్యార్థినులను వేధిస్తున్న హెచ్‌ఎం భర్తపై కేసు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశం
- కాకవాడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల సందర్శన
- విద్యార్థినుల ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకోవాలని సూచన
- సమగ్ర విచారణకు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం



కాకవాడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల నుంచి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: మండలంలోని కాకవాడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను వేధిస్తున్న హెచ్‌ఎం భర్త ప్రసాద్‌పై కేసు నమోదు చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశించారు. విద్యార్థినుల వేధింపులపై గ్రామ సర్పంచ్ కొమరం కొండదొర, గ్రామస్తులు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, ఎమ్మెల్యే ధనలక్ష్మికి మంగళవారం ఉదయం ఫిర్యాదు చేశారు. వెంటనే ఐటీడీఏ పీవో పాఠశాలను సందర్శించారు. సమగ్ర విచారణకు ఆయన ఆదేశించారు.

ఎమ్మెల్యే ఎదుట కన్నీరు

కాకవాడ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పావని భర్త ప్రసాద్ పాఠశాలలోనే ఉంటూ వేధింపులకు గురి చేస్తున్నడని విద్యార్థినులు ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎదుట కన్నీరు పెట్టారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మిలతో పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. హెచ్‌ఎం భర్త గురించి వారు ఆరా తీశారు. జరిగిన విషయాలను నిర్భయంగా చెప్పాలని వారు విద్యార్థులను కోరారు. తల్లిదండ్రులు వచ్చినా సరిగ్గా మాట్లాడనివ్వడం లేదని విద్యార్థినులు వాపోయారు. వార్డెన్‌ను రెండు నెలలకు ఒకసారి మార్చుతున్నారని ఎమ్మెల్యేకు వారు వివరించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థినులకు సంబంధించి బంధువులు వస్తే అనరాని మాటలు అంటున్నారని కన్నీరు పెట్టారు. భోజనం మెనూ ప్రకారం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్నానాలు చేసి బట్టలు మార్చుకుంటుంటే హెచ్‌ఎం భర్త కిచెన్ దగ్గర ఉండి చూసేవాడని విలపించారు. ఏమాత్రం ఆరోగ్యం బాగులేకపోయినా ఆస్పత్రికి తీసుకువెళ్లడం లేదని వాపోయారు. గతంలో తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తే హెచ్‌ఎం తమను కొట్టారని కన్నీటి పర్యంతమయ్యారు.

ఆకస్మిక తనిఖీలు చేస్తాం: ఎమ్మెల్యే ధనలక్ష్మి

కాకవాడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులపై వేధింపుల నేపథ్యంలో తమ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని ఎమ్మెల్యే ధనలక్ష్మి పేర్కొన్నారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారం అందడం లేదని గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. హెచ్‌ఎం పావనిని సెలవుపై వెళ్లిపోవాలని ఆదేశించారు. హెచ్‌ఎం భర్తపై కేసు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. స్టోర్ రూమ్‌ను తనిఖీ చేస్తే 700 కేజీల బియ్యం అదనంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గుడ్లు కూడా అదనంంగా ఉన్నాయన్నారు. పాఠశాల ఆవరణతో హెచ్‌ఎం భర్తకు సంబంధం లేదని, విద్యార్థినుల ఫిర్యాదు ఆధారంగా అతనిపై కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్



పాడేరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



పెద్దఅడ్డపల్లిలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

సాక్షి,పాడేరు: బడుగు,బలహీన వర్గాల ప్రజల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.మంగళవారం ఆయన వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి స్థానిక పాతబస్టాండ్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆయన ఆలోచన విధానానికి తగ్గట్లుగానే బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. పాడేరు ఎంపీపీ ఎస్.రత్నకుమారి,జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఎంపీటీసీలు చల్లా చిట్టమ్మ,లకే రామకృష్ణపాత్రుడు, డి.సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్‌లు వనుగు బసవన్నదొర, నీలకంఠం, లకే పార్వతమ్మ, వంతాల పార్వతమ్మ, వంతాల సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: స్థానిక ఐటీడీఏలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతి సామాజిక వర్గానికి రాజ్యంగ ఫలాలు అందేలా అతిపెద్ద రాజ్యంగాన్ని రచించారని పేర్కొన్నారు. ఆయన ఆలోచన విధానం, స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. ఆయన ఆశయాలు ఆచరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం. వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, పరిపాలనాధికారి హేమలత, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.



ఐటీడీఏలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పీవో గోపాలకృష్ణ

గంగవరం: పెద్దఅడ్డపల్లి ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలోరంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ఎంపీపీలు కుంజం గంగాదేవి, కె. రామతులసి సర్పంచ్‌లు బి. రామలక్ష్మి, వెంకటేశ్వర్లు, కుంజం లక్ష్మి , మరిడమ్మ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, ఎంఈవో మల్లేశ్వరరావు, హెచ్‌ఎం కారం లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు గుర్తించి.. వెంటనే స్పందించి..

- పరిష్కారానికి చర్యలు చేపట్టిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- మారుమూల గ్రామాల్లో సుడిగాలి పర్యటన



కిల్లంకోటలో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

జి.మాడుగుల: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. కిల్లంకోట, కోడిమామిడి, బొయితిలి, కె బందవీధి, చిలకపనస గ్రామాలను ఆయన సందర్శించారు. కోడిమామిడి–కిల్లంకోట గెడ్డపై వంతెన నిర్మించాలని ఆయనకు స్థానిక గిరిజనులు విన్నవించారు. పసుపు, రాజ్‌మా, వరిపంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు కోరారు. పంట చేతికి వచ్చే15 రోజుల ముందు సమాచారం అధికారులకు అందిస్తే గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. రేషన్ పంపిణీ సమస్య పరిష్కరించాలని కిల్లంకోట గిరిజనులు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కిల్లంకోట, కోడిమామిడి గ్రామాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ కేంద్రం ఏర్పాటుకు నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. చిలకపనస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రతీ రోజు పాఠశాలకు వస్తున్నది లేనిది గ్రామస్తులనుంచి తెలుసుకున్నారు. చిలకపనసలో జలజీవన్ మిషన్ తాగునీటి పనులు తక్షణమే ప్రారంభించాలని అధికారులను ఆయన ఆదేశించారు. కె బందవీధి గ్రామానికి నాడు–నేడు పథకం కింద పాఠశాల భవనం మంజూరు చేశామని, పనులు వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. బొయితిలిలో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో 290 మంది విద్యార్థులకు గాను 150 మంది లేకపోవడంపై ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.చంద్రశేఖర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల స్టోర్‌రూమ్‌లో పాఠ్య పుస్తకాలు నిల్వలను గుర్తించిన కలెక్టర్ పంపిణీపై ఆరా తీశారు. విద్యార్థుల మూమెంట్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కోరారు. నాణ్యమైన భోజనం అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లోహిత్ జయసాగర్, తహసీల్దార్ అప్పల స్వామి, ఎంపీటీసీ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రికవరీని బట్టి వీవోఏలకు జీతాలు

ఏపీడీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరావు

రాజవొమ్మంగి: వీవోఏల (బుక్‌కీపర్స్/ ఏనిమేటర్స్) పనితీరు బాగుంటేనే జీతాలు ఇవ్వడం జరుగుతుందని వైఎస్సార్‌క్రాంతిపథకం ఏపీడీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మహిళాసమాఖ్య అధ్యక్షురాలు వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల రుణాల రికవరీ నూరు శాతం ఉంటేనే వీవోఏలకు జీతాలు ఇచ్చేందుకు సంఘాల్లో తీర్మానం చేయాలని గ్రామసమాఖ్య లీడర్లకు ఆయన సూచించారు. గ్రామసంఘాల ద్వారా ఇప్పటి వరకు సభ్యులకు ఇచ్చిన రుణాలను వెంటనే రికవరీ చేయాలని సూచించారు. వీవోఏల పని తీరు సంతృప్తికరంగా ఉన్నదీ లేనిది చూడాలన్నారు. వైస్సార్ ఆసరా బయోమెట్రిక్ థంబ్ వేయించడం శత శాతం పూర్తి కావాలని సూచించారు. గ్రామసమాఖ్య పరిధిలోని చిరువ్యాపారుల జాబితా తయారు చేయాలని ఆదేశించారు. శాశ్వత గృహనిర్మాణాలు మంజూరైన లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు మంజూరు అయ్యేలా బ్యాంకులకు వెళ్లి మాట్లాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐబీ. రాధాఅపర్ణ, ఐటీ యాంకర్‌పర్సన్ రామరాజు, ఏపీఎం ఆదినారాయణ, మండలసమాఖ్య కార్యదర్శి లింగమ్మ, సీసీలు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు 24 గంటల్లో చెల్లింపులు

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ




గిరిజనులు సేకరించిన కాఫీ పండ్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్: మాక్స్ సంస్థకు కాఫీ పండ్లను విక్రయిస్తున్న గిరిజన కాఫీ రైతులకు 24 గంటల్లో చెల్లింపులు చేయాలని ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆయన పాడేరు మండలం ఇసుకగరువు గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులు సాగు చేస్తున్న కాఫీ తోటల వద్దకు వెళ్లారు. వారు సేకరిస్తున్న కాఫీ పండ్లను పరిశీలించారు. మాక్స్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కొనుగోళ్ల తీరుపై ఆరా తీశారు. రైతులకు సకాలంలో నగదు అందుతుందా లేదా అనే విషయంపై అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా ఉందని గ్రామస్తులు పీవో దృష్టికి తీసుకువచ్చారు. ఈ భవనాన్ని త్వరితిగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజును ఆదేశించారు. గ్రామంలో 35 మంది విద్యార్థులు ఉన్నారని పాఠశాల భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. పాఠశాల భవనం మంజూరుకు కృషి చేస్తానని ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈవో రమేష్‌ను ఆదేశించారు.

గిరి యువతకు ఉపాధి లక్ష్యం

- స్కిల్ హబ్ సెంటర్ల ద్వారా మెరుగైన అవకాశాలు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



స్కిల్‌హబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా గిరి యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటుచేసిన స్కిల్‌హబ్ కేంద్రాన్ని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబుతో కలిసి స్కిల్ హబ్ కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన యువతీ,యువకులు కంప్యూటర్ విభాగంలో శిక్షణ పొందేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ అనంతరం పేరొందిన ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ప్రైవేట్ రంగాలలోను మంచి వేతనాలతో కూడిన ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. టూరిజం. హోటల్ మేనేజిమెంట్, వ్యవసాయ రంగాల్లో శిక్షణ ద్వారా నైపుణ్యం పెంపొందించుకోవాలని ఆమె సూచించారు.రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ వైటీసీలు,స్కిల్ హబ్ కేంద్రాల నిర్వహణ బాధ్యతను అనుభవజ్ఞులైన గిరిజనులకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రోహిణి, పాలిటెక్నిక్ కళాశాల డాక్టర్ కె.సుజాత, జిల్లా వ్యవసాయాభివృద్ధి సలహామండలి అధ్యక్షురాలు సరస్వతి, చింతలవీధి ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి,సర్పంచ్ వంతాల సీతమ్మ, గొందూరు,కించూరు సర్పంచ్‌లు సీదరి రాంబాబు,వంతాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- వణికిస్తున్న చలిగాలులు
- మినుములూరులో 10..
- అరకులోయలో 11.1
- చింతపల్లిలో 12.2 డిగ్రీల నమోదు



అరకులో ఉదయం 9 గంటలకు దట్టంగా మంచు

సాక్షి,పాడేరు: మళ్లీ చలిగాలులు విజృంభిస్తున్నాయి.సోమవారం అర్ధరాత్రి నుంచి దట్టంగా పొగమంచు కురిసింది. మంగళవారం ఉదయం 10గంటల వరకు పాడేరు,అరకులోయ,చింతపల్లి, సీలేరు, మోతుగూడెం,మారేడుమిల్లి ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురిసింది. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 10 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 11.1, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 12.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వేతన సమస్య పరిష్కారానికి హామీ



ఆందోళన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రంపచోడవరం: సత్యసాయి వాటర్ స్కీం ఉద్యోగులకు సత్వరం వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి హామీ ఇచ్చారు. మంగళవారం ఆమె స్థానిక ఐటీడీఏ ముందు ఆందోళన చేస్తున్న సత్యసాయి వాటర్ స్కీమ్ ఉద్యోగుల ఆందోళన శిబిరాన్ని సందర్శించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మంప పోలీసుల ఏరియా డామినేషన్



ఏరియా డామినేషన్ చేస్తున్న పోలీసులు



జడ్డంగిలో వాహన తనిఖీలు

కొయ్యూరు: పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఏరియా డామినేషన్ నిర్వహించారు. చీడిపాలెం నుంచి బూదరాళ్ల వరకు రోడ్లను పరిశీలించారు. ఆ ప్రాంతంపై పట్టు సాధించేందుకు ఏరియా డామినేషన్ చేపట్టారు, ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న పక్క ప్రాంతం నుంచి డామినేషన్ చేశారు. ఆ ప్రాంతంలో అనేక కల్వర్టులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పీఎల్‌జీఏ వారోత్సవాలు పురస్కరించుకుని పూర్తిగా గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఒకప్పుడు మావోయిస్టులకు అడ్డగా ఉన్న బూదరాళ్ల పంచాయతీలో అనేక గ్రామాలను తిరిగామన్నారు. మావోయిస్టులకు సహకరించవద్దని ఆయన కోరారు.

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి స్టేషన్ ఎదుట ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి తదితర అక్రమ సరకు రవాణాపై నిఘాలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దర్జాగా దళారుల దందా

తీవ్రంగా నష్టపోతున్న పత్తి రైతులు



మండలంలో పత్తిని తెలంగాణకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన లారీ

ఎటపాక: గ్రామాల్లో దళారుల దందా ఎక్కువయింది. రెక్కల కష్టంతో ఆరుగాలం పండించిన పంటను పెట్టుబడుల సాకుతో వ్యాపారులు దోచుకుని రైతులను దగా చేస్తున్నారు. అప్పులు చేసి మరీ సాగు చేసిన పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు శ్రమదోపిడీకి గురువుతున్నారు. ఈ ఏడాది పత్తి సాగు ప్రారంభంలోనే గోదావరి వరదలు మూడు సార్లు రావడంతో వందలాది ఎకరాల్లోని పత్తి పంట నీట మునిగి పాడైంది. అయినా అధిక అప్పులు చేసి మరలా పత్తి సాగు చేశారు కొందరు రైతులు.. ప్రస్తుతం 1725 హెక్టార్లలో మండలంలో పత్తి సాగు చేశారు. చేతి కందిన పత్తిని అమ్ముకుందామంటే అన్నీ అడ్డంకులే...పంటల సాగుకు పెట్టుబడులు ఇచ్చామనే కారణంతో వ్యాపారులు అడిగిన దరకే పత్తిని ఇవ్వాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా పండిన పంటనంతా అమ్మినా చేసిన అప్పులు తీరవని దిగులు చెందుతున్నారు.

పడికట్టు కాటాలతో మోసాలు

పత్తి వ్యాపారులు పడికట్టు కాటాలతో రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. పత్తిని అమ్ముకునేందుకు అందుబాటులో సీసీఎల్ కొనుగోలు కేంద్రం లేక పోవడంతో గ్రామాల్లో కమిషన్ ఏజెంట్ల దందాకు రైతులు గురవుతున్నారు. వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ రైతులను దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. తెలంగాణా రాష్ట్రం దుమ్ముగూడెం, పాల్వంచ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చిన దళారులు తప్పుడు కాంటాలతో స్థానిక రైతులను నిలువునా మోసం చేస్తున్నట్టు చెబుతున్నారు. కొందరు వ్యాపారులు రిమోట్ కాటాలను వాడుతూ అమాయక గిరిజనులను దోచుకుంటున్నారని ఆందోళన చెందుతున్నారు. దళారులు గ్రామాల్లో కొన్న పత్తికి తప్పుడు ఆధారాలు చూపిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

తక్కువ ధరతో నష్టపోతున్న రైతులు

దళారుల రంగ ప్రవేశంతో పత్తి రైతులకు గిట్టుబాటు ధర రాక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తికి క్వింటాకు కనిష్టంగా రూ.8500 నుంచి గరిష్టంగా రూ.9 వేల వరకు పలుకుతుంది.

అయితే దళారులు మాత్రం గ్రామాల్లో కొనుగోలు చేస్తున్న పత్తికి క్వింటాకు కేవలం రూ.8వేల లోపే ధర చెల్లిస్తున్నారని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. తమకు సమీపంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో కమీషన్ ఏజెంట్లుకు అమ్ముకుంటున్నామని వాపోతున్నారు. అధికారులు దళారుల దందాను అరికట్టి రైతులకు నష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీసీఎల్ కేంద్రం లేక ఇబ్బంది



రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు పత్తి కొనుగోలు కేంద్రం లేకపోవడం ఇబ్బందిగా ఉంది. గిట్టుబాటు ధర వస్తే బహిరంగ మార్కెట్‌లో ఎక్కడైనా అమ్ముకోవచ్చు. కొందరు వ్యాపారులు కాటాల్లో మోసాలకు పల్పడుతున్నట్టు తెలిసింది.తూనికలు, కొలతల శాఖ తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి.

–రాబిన్ సుదర్శన్, ఏవో, ఎటపాక

జాతీయ క్రీడా పోటీల్లో సత్తాచాటిన బుద్ధు



జాతీయ స్థాయి క్రీడా పోటీలో పాల్గొన్న కిల్లో బుద్ధు

అరకులోయ రూరల్: జాతీయ స్థాయిలో నిర్వహించిన పరుగు పందెం క్రీడా పోటీల్లో గిరిజన యువకుడు పాల్గొని ప్రదర్శన కనబర్చాడు. మండలంలో పెదలబుడు పంచాయతీ గరుడగుడ గ్రామానికి చెందిన కిల్లో బుద్ధు ఈనెల 4న పూణేలో నిర్వహించిన 36వ జాతీయ స్థాయి పరుగు పందెం క్రీడా పోటీల్లో పాల్గొని, 15వ స్థానంలో నిలిచినట్టు ఆయన మంగళవారం ఫోన్‌లో తెలిపారు. క్రీడలపై ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత లేదని, ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆర్థిక సాయంతో పోటీల్లో పాల్గొని విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం మరింత ప్రొత్సాహం అందిస్తే మరెన్నో విజయలు సాధించి మంచిపేరు తీసుకోస్తానన్నారు.

800 లీటర్ల పులుపు ధ్వంసం

కొయ్యూరు: రేవళ్ల శివారులో మహిళా పోలీసు, వలంటీర్లు కలిసి 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు చేపట్టిన దాడులోపులుపు ధ్వంసం చేశామన్నారు. అనంతరం రేవళ్లలో నిర్వహించిన సమావేశంలో సారా తయారీ, అమ్మకాల వల్ల కలిగే అనర్థాలను వివరించినట్టు చెప్పారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు



గంజాయితో పట్టుబడ్డ అంతర్రాష్ట్ర ముఠా సభ్యులతో గూడెంకొత్తవీధి పోలీసులు

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మంగళవారం మధ్యాహ్నం అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులు పట్టుబడ్డారు. సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి అందించిన వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు గూడెంకొత్తవీధి సమీపంలోని సంస్థ కాలనీ వద్ద ఏపీఎస్పీ పోలీసులతో కలసి తనిఖీలు నిర్వహిస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో సీలేరు నుంచి గూడెంకొత్త వీధి వైపు ఎరుపురంగు హోండా కారు వచ్చింది. దాన్ని ఆపడంతో అందులో ఉన్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. సిబ్బంది సహాయంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. కారులో 18 కిలోల గంజాయి పట్టుబడింది. పట్టుబడ్డ వారిలో మహారాష్ట్రలోని పూణె జిల్లాకు చెందిన రోహిత్ పోపాట్ పవార్, ఆదిత్యబాలు జాదవ్, చేతన్ యశ్వంత్ పవార్, శోపన్‌ద తోబా బందాల్కర్, అభిషేక్ లాల మద్నే ఉన్నారు. వీరిని విచారించగా ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి గంజాయి తీసుకుని వస్తున్నట్టు నిందితులు వెల్లడించారని సీఐ తెలిపారు. గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఆరుగురు యువకుల అరెస్టు

పరారీలో హోంగార్డు

నర్సీపట్నం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఆరుగురు యువకులను అరెస్టు చేశామని, మరో ముగ్గురు యువకులు పరారీలో ఉన్నారని టౌన్ సీఐ ఎన్.గణేష్ తెలిపారు. వివరాలివి. బీసీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు తనను తీవ్రంగా కొట్టి, కులం పేరుతో దూషించారని పెదబొడ్డేపల్లికి చెందిన ఉర్ల నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసును డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ స్వయంగా విచారించారని, ఈమేరకు హోంగార్డుతో పాటు ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. బీసీ కాలనీకి చెందిన షేక్ జిలానీ(25), చిక్కాసాయి సంతోష్(24), కృష్ణాబజార్‌కు చెందిన పుర్రే దుర్గాప్రసాద్(28), పీనారపాలెంకు చెందిన నాగుమంత్రి కామేశ్వరరావు(21), కంబాలపాటి సూర్యప్రకాష్ (20), కదిరి స్వామి(27)లను అరెస్టు చేశామని, హోంగార్డుతో పాటు మరో ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. కొట్లాట కేసులో ఉన్న వారందరినీ గుర్తించామని, వారందరినీ ఆర్డీవో ఎదుట హాజరుపరిచి బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి ఉత్సవాలు



నృత్యం చేస్తున్న గిరిజనులు



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

దుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీ కమలబంద గ్రామంలో గంగమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించి, ఆలయంలో ప్రతిష్ఠించారు. వేడుకల్లో భాగంగా గిరిజనుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో వేడుకలను 14రోజుల పాటు నిర్వహంచారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. సర్పంచ్ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాచలం, కృష్ణారావు, నర్సింగరావు, మోహన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా శాంతి స్థూపం



జి.మాడుగుల వారపుసంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన శాంతి స్థూపం

జి.మాడుగుల: మావోయిస్టుల చేతిలో అసువులు బాసిన గిరిజన సోదరులకు జోహార్లు అంటూ జి.మాడుగుల సంతబయలు గ్రామంలో మంగళవారం వారపుసంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా శాంతి స్థూపం వెలిసింది. గిరిజన ప్రాంతాలకు చెందిన అనేక మంది గిరిజనులను 2014- ఏప్రిల్ 2022 మధ్య పలువురు గిరిజనులకు మావోయిస్టుల చేతిలో ప్రాణాలు కోల్పోయారన్నారు. వారి పేర్లను స్థూపంపై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కాలు తెగి పడి...



తీవ్రంగా గాయపడిన ముసలయ్య

అడ్డతీగల: అడ్డతీగల మండలం వేటమామిడి వద్ద హోసన్నా స్కూల్ సమీపాన మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గంగవరం మండలం ఏటిపల్లికి చెందిన బొరగా ముసలయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో శరీరం నుంచి కుడికాలు వేరుపడింది. ఏటిపల్లికి చెందిన ముసలయ్య అడ్డతీగలలో వారపుసంతకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తూ అదే గ్రామానికి చెందిన మామిడి చంద్రశేఖరరెడ్డి మోటార్‌సైకిల్ ఎక్కాడు. వేటమామిడి దాటాక ఎదురుగా అడ్డతీగల వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం మోటార్‌సైకిల్ వెనుక కూర్చొన్న ముసలయ్యని బలంగా ఢీకొట్టింది. దీంతో అతని కుడికాలు శరీరం నుంచి వేరుపడి, తీవ్ర రక్తస్రావంతో రోడ్డుపై పడిపోయాడు. కాగా ప్రమాదంలో మోటార్‌సైకిల్ నడుపుతున్న చంద్రశేఖరరెడ్డి క్షేమంగా బయటపడ్డాడు. ప్రమాదానికి కారణమైన వాహనం బోర్లు డ్రిల్లింగ్ చేసే లారీగా చెబుతున్నారు. ఈ లారీ ఏలేశ్వరంకి చెందినదిగా తెలుస్తోంది. ఘటన తర్వాత ఆ వాహనం ఆపకుండా పరారైందని చెబుతున్నారు. తీవ్ర రక్తస్రావంతో ముసలయ్య రోడ్డుపై పడి విలవిల్లాడుతుండడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి, అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అతడిని కాకినాడ సామాన్య ఆస్పత్రికి రిఫర్ చేశారు. సంఘటనాస్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు.

20 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో నిందితులు

మోతుగూడెం: మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 20 కిలోల గంజాయి పట్టుబడినట్టు ఎస్‌ఐ వి. సత్తిబాబు తెలిపారు. స్టేషన్ ఎదుట చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా మోటార్ బైక్‌పై రెండు బ్యాగుల్లో తరలిస్తున్న 20 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ఈ కేసులో వై రామవరం మండలం బొడ్డగండి గ్రామానికి చెందిన బి.రవి, కిలో చిత్రమ్ అలియాస్ సీతారాం, తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన ఎం.రాకేష్, డి.నవీన్‌కుమార్ అనే యువకుల్ని అరెస్టు చేసినట్టు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందన్నారు. నిందితుల వద్ద నాలుగు ఫోన్‌లు, ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



ప్రమాదానికి గురైన కారు

అడ్డతీగల: అడ్డతీగల మండలం వేటమామిడి–పైడిపుట్ట గ్రామాల మధ్య పవర్ ప్రాజెక్ట్ సమీపాన మంగళవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. అదృష్టవశాత్తూ కారులో ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులోని ఆరుగురు ప్రయాణికులు ఎటువంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభాన్ని బలంగా ఢీకొట్టి తిరగబడింది. దీంతో స్తంభం విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాజవొమ్మంగికి చెందిన ఆరుగురు పైడిపుట్ట విహారయాత్రకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద స్థలాన్ని ఎస్‌ఐ అప్పలరాజు సందర్శించారు. కారులో ఉన్న వారందరూ సురక్షితంగా ఉన్నారన్నారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన మహిళకు డెంగ్యూ



రాజవొమ్మంగి: బూరుగపల్లి గ్రామానికి చెందిన పాత్తూరి కృష్ణకుమారి (25) డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయినట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీదుర్గ మంగళవారం రాత్రి తెలిపారు. ఫీవర్ సర్వేలెన్స్ సర్వేలో భాగంగా గ్రామంలో ఇంటింటా జ్వరపీడితులపై ఆరా తీస్తుండగా జ్వరంతో మంచాన పడ్డ కృష్ణకుమారిని తమ సిబ్బంది గుర్తించినట్టు చెప్పారు. ఈ మేరకు ఆమెను వెంటనే రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షల్లో డెంగీ పాజిటివ్ నిర్ధారణ కావడంతో ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నట్టు తెలిపారు.

విస్తారంగా బర్లీ పొగాకు సాగు



రాజవొమ్మంగిలో బర్లీ పొగాకు పంట

రాజవొమ్మంగి: వేసవిలో పండించే తడుపు పొగాకు పంటసాగులో గిరిరైతు ఆసక్తి కనపరుస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్టులో డిమాండ్ ఉన్న ఈ పొగాకును బర్లి పొగాకుగా పేరొందింది. ప్రస్తుతం రాజవొమ్మంగి మండలంలో ప్రయోగాత్మకంగా వంద మంది రైతుల ద్వారా ఐటీసీ కంపెనీ సాగుకు ప్రోత్సహిస్తోంది. అలాగే ఖరీఫ్ వరి కోతలు పూర్తయిన తరువాత పొగాకు సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. ఇందుకు గాను వీబీహెచ్-8, వీబీహెచ్-3 వంటి పొగాకు రకాలకు చెందిన నారును రాజమండ్రి నుంచి తీసుకొని వచ్చి రైతులకు అందజేస్తున్నారు. అలాగే పంటకాలంలో అవసరమైన పెట్టుబడి రుణం రూపంలో కంపెనీ అందజేస్తోంది. ఈ రకం పొగాకు కిలో గరిష్ట ధర రూ.110 పలుకుతుండగా ఎకరాకు టన్ను నుంచి టన్నున్నర పొగాకు దిగుబడిని రైతులు ఆశిస్తున్నారు. పొగాకు సాగులో ఎకరాకు రూ. 30వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. వాతావరణం అనుకూలించి, దిగుబడి బాగుంటే లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందని పలువురు రైతులు చెబుతున్నారు. మండల పరిసర ప్రాంతాల్లో వర్షాధారంగా (మాన్‌సూన్ బర్లీ) దాదాపు 2వేల ఎకరాల్లో వేశారు. ఈ పంట కోత పనులు పూర్తికాగా ఆరబెట్టిన పొగాకును బేళ్లుగా కట్టి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. వేసవిలో కూడా పొగాకు సాగువైపు రైతులు ఉత్సాహం చూపుతున్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం



సంజీవనగర్‌లో రైతు కల్లం వద్ద ధాన్యం కొనుగోలును పర్యవేక్షిస్తున్న ఏఓ చక్రధర్

రాజవొమ్మంగి: ఖరీఫ్ సీజన్ లో రైతులు పండించిన ధాన్యం దళారుల పాలుకాకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టింది. రైతులకు ఇబ్బంది లేకుండా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కల్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన కేంద్రాల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని జడ్డంగి రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు చురుగ్గా జరుగుతున్నట్టు ఏవో చక్రధర్ చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు జరుగుతున్నాయని, మండలంలోని మరిన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరలో అందుబాటులో తీసుకొస్తామన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు

దేవీపట్నం: మండలంలోని నాలుగు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేపడుతామని ఏవో జెస్సీ తెలిపారు. ఇందుకూరుపేటలో బుధవారం ఉదయం 11 గంటలకు రైతు భరోసా కేంద్రం వద్ద ఎంపీపీ కుంజం మురళీ చేతుల మీదుగా కొనుగోలు కేంద్రం ప్రారంభమవుతుందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

క్వారీ పేలుళ్లతో ఇళ్లకు నష్టంపై విచారణ



ఇళ్ల సమస్యపై మైనింగ్ ఏడీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు, సర్పంచ్ శ్రీనివాసరావు

రోలుగుంట: వెదుళ్లవలస రెవిన్యూ 149/2 సర్వే నంబర్‌లో గల క్వారీ అనుమతులు రద్దు చేసి, అక్కడ బ్లాస్టింగ్‌ల వల్ల తమ ఇళ్లకు కలుగుతున్న నష్టాన్ని నివారించాలని భోగాపురం గ్రామానికి చెందిన బాధితులు సర్పంచ్ బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత నెల 21న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనికి కలెక్టర్ స్పందించి మైనింగ్ ఏడీ ధనుంజయనాయుడుకు విచారణ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలానికి వచ్చి సదరు క్వారీ వద్దకు వెళ్లి పరిశీలించారు. బాధితులు మడ్డు తమ్మునాయుడు, శ్రీను, నర్సింహమూర్తి, ఆరిపల్లి నారాయణమ్మ తదితరుల ఇళ్లను కూడా పరిశీలించారు. దీనిపై ఏడీ మాట్లాడుతూ ఇళ్లకు పగుళ్లు ఏర్పడడానికి క్వారీ బాస్టింగ్‌లు కారణమా, లేదా మరో కారణమా అనేది నిర్ధారించాల్సి ఉందన్నారు. అందుకు మరలా అవసరమైన మిషన్‌తో పరిశీలించే అవకాశం ఉందన్నారు. పరిశీలన అంశాలను కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు.